క్లుప్తంగా

ఎంఈఓలకు వీడ్కోలు, స్వాగతం



ఎంఈఓలను సన్మానిస్తున్న ఎంఆర్‌సీ సిబ్బంది

టేకులపల్లి: మండలంలో తొమ్మిది సంవత్సరాలు ఎంఈఓగా పనిచేసిన ఠాకూర్ రాంసింగ్, నూతన ఎంఈఓగా వచ్చిన అజ్మీర జగన్‌నాయక్‌లను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు శనివారం ఎంఈఓ కార్యాలయంలో ఎంఆర్‌సి సిబ్బంది వారికి జ్ఞాపికలను అందజేశారు.

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీ

సుజాతనగర్: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని ఏఓ జి.నర్మద అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పురుగుమందులు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిష్టర్లను పరిశీలించారు. మాట్లాడుతూ.. ఎరువులను అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ప్రతీ దుకాణం ఎదుట ధరల బోర్డు ఏర్పాటు చేలన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయండి..

జూలూరుపాడు: అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ గోర్ బంజారా పోరాటా సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ తాళ్లూరి రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింఛన్ కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో పింఛన్‌ను రూ.4,000లకు పెంచుతామన్న హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మండల విద్యాశాఖ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): నూతనంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ప్రభుదయాళ్ అధ్వర్యంలో శనివారం కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి హాజరై మాట్లాడుతూ... వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాఠశాలకు సంబంధించిన అన్ని రిపోర్టులు క్రమం తప్పకుండా పంపాలని, లేదంటే జిల్లాస్థాయి నివేదిక ఆలస్యం అవుతుందని దానికి మీరే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఇప్పడు అన్ని మండలాలకు నూతన ఎంఈఓలు వచ్చినందున ప్రభుత్వ పథకాల అమలు పట్ల శ్రద్ధ పెట్టాలని, వాటిని విద్యార్థుల్లోకి తీసేకెళ్లే బాధ్యత మీదేనన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): ఎవరైనా వ్యకి ప్రమాదానికి గురైతే, ఆ వ్యక్తిని కాపాడటానికి ఈ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని జీఎం సెక్యూరిటీ కోడూరి శ్రీనివాస్ అన్నారు. కార్పొరేట్ ఎస్‌అండ్‌పీసీ కార్యాలయంలో 32వ బ్యాచ్ 30 మంది సిబ్బందికి ఈనెల 23 నుంచి నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్, అండ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ ఎస్‌అండ్‌పీసీలలో ఉత్సాహం పెంచటమే కాకుండా విధుల పట్ల అంకితభావాన్ని పెంచుతుందన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

ప్రశస్త్ యాప్‌పై..

టేకులపల్లి: ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థులను స్క్రీనింగ్ ద్వారా గుర్తించి వారికి అనుకూలమైన విద్యా బోధన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రశస్త్ యాప్ నిర్వహణపై ఈనెల 25న ప్రారంభమైన ఉపాధ్యాయుల శిక్షణ శనివారం ముగిసింది. సులానగర్ ఉన్నత పాఠశాలలో ఐఈఆర్‌పీల ఆధ్వర్యంలో జరిగిన శిబిరాన్ని ఎంఈఓ అజ్మీర జగన్‌నాయక్ పర్యవేక్షించారు. 407 మంది ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు శిక్షణకు హాజరయ్యారు.

మౌలిక వసతులు కల్పించండి..

ఇల్లెందురూరల్: ఐదేళ్ల క్రితం ప్రభుత్వ భూమిలో గుడిసెలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న పేదలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నేతలు అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని సీఎస్పీ బస్తీ రాజీవ్‌నగర్ తండా సమీపంలోని గుడిసెవాసుల కాలనీలో శనివారం సీతారాం ఏచూరికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా భూపోరాటాలు చేసి సాధించుకున్న భూమిలో గుడిసెలు ఏర్పాటు చేసుకున్న పేదలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా అటవీశాఖ, సింగరణి, రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. మన్యం మోహన్‌రావు, జయసుధ, కుమారి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- రూ.450 కోట్లతో రింగురోడ్డు నిర్మాణానికి అనుమతులు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 3, 4, 23, 32, 33, 34వార్డుల్లో రూ.4.50కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ, బీటీరోడ్లు, పార్కుల అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సింగరేణి హెడ్డాఫీసు, మహిళా కళాశాల సెంటర్ నుంచి పాత కొత్తగూడెం మీదుగా బైపాస్ రోడ్డు వరకు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు పాతకొత్తగూడెంలో శంకుస్థాపన చేశారు.

కూనంనేని మాట్లాడుతూ... మహిళా కళాశాల నుంచి బైపాస్ వరకు నిర్మించే బీటీ రోడ్డుతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రూ.9.20 కోట్లతో పట్టణంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిస్కారం కోసం రూ.450 కోట్లతో రింగు రోడ్డు నిర్మాణానికి అనుమతులు లభించాయని చెప్పారు. అదేవిధంగా పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలు, పరిసర ప్రాంతాలను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వంపై వత్తిడి తెచ్చిన ఫలితంగా అధికార యంత్రాంగం అందుకు ప్రక్రియ ప్రారంభించిందన్నారు. వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ తరహాలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను మహానగరాలుగా తీర్చిదిద్దేదుకు, ఆదర్శవంతమైన నియోజకవర్గంగా కొత్తగూడెం నియోజకవర్గాన్ని నిలిపేందుకు కృషి జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేర్చడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, చైర్‌పర్సన్ కాపు సీతామాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, తహసీల్దార్ పుల్లయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ రవికుమార్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, మహ్మద్ యూసఫ్, భూక్యా శ్రీనివాస్, బోయిన విజయ్, ధర్మరాజు, బండి నరసింహా, సుజాత, పరమేష్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, సత్యభామ, మమత, కాసుల ఉమారాణి పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ చూపండి..



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏరియా జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణి క్రీడాకారులు క్రీడాపోటీల్లో ప్రతిభ చాటాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అన్నారు. శనివారం ఇల్లెందు 24 ఏరియా గ్రౌండ్‌లో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీజినల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. క్రీడల వల్ల స్నేహభావం, శారీరక దారుఢ్యం పెంపొందించుకోవచ్చన్నారు.

ప్రతీ సంవత్సరం సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమం కోసం క్రీడాపోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. అంతకు ముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. లాన్ టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రెటరీ నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం తరుపున యాదగిరి, క్రీడల గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, సమన్వయకర్త రమేష్ సింగ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు, రేపు క్రీడాకారుల ఎంపికలు

పాల్వంచరూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో డివిజన్ స్థాయి క్రీడా పోటీల ఎంపికలు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశాల మేరకు ఆదివారం, సోమవారం నిర్వహించనున్నట్లు ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్ తెలిపారు. స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయంలో శనివారం హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. నవంబర్‌లో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలలో భాగంగా భద్రాచలం ఐటీడీఏ స్థాయి గిరిజన పాఠశాలల క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఆర్చరీ, అథ్లెటిక్స్, క్యారమ్స్, చందరంగం పోటీలను బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. దమ్మపేట డివిజన్ స్థాయి ఎంపికలు ఏఏహెచ్‌ఎస్ పరకలగండిలో, పాల్వంచ డివిజన్ స్థాయి ఎంపికలు కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో ఎంపికై న క్రీడాకారులను అక్టోబర్‌లో నిర్వహించనున్న జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాల్‌రావు, ఏఎస్‌ఓ వెంకటనారాయణ, హెచ్‌ఎం.రామారావు, ఎల్.రవి, వ్యాయామ ఉపాధ్యాయులు బాల సుబ్రహ్మణ్యం, అన్నం వెంకటేశ్వర్లు, నగేష్, వెంకన్న, కె.నర్సయ్య, రాంబాబు, ప్రత్యూష, సావిత్రి, రమేష్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై పోరాడాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు గుర్తించి పోరాటాలకు సిద్ధం కావాలని, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. శనివారం పాత కొత్తగూడెం శాఖ మహాసభలను ఆయన జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ముందుగా సీపీఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. పాత కొత్తగూడెం వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు చేసి వార్డుల అభివృద్ధి కొరకు భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రజాపోరాటాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలకు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో లిక్కి బాలరాజు, భుక్యా రమేష్, జునుమాల నగేష్, ఆవుల శ్రీరాములు, ధనియాకు శివ, జునుమాల వందన, కొలిపాక వెంకటేశ్వర్లు, నాగకృష్ణ, మున్ని, ముత్తేజ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా మండల కమిటీ ఎన్నిక



సరిత, మద్దెల శ్రీలక్ష్మి

సుజాతనగర్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల 3వ మహాసభను శనివారం సుజాతనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాతనగర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షురాలిగా దండు సరిత, కార్యదర్శిగా మద్దెల శ్రీలక్ష్మితో పాటు 18 మందిని ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... మండల కేంద్రంలో బెల్ట్ షాపులు మూసివేయాలని, డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలని, మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని, సులభ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడంతో పాటు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కళ్యాణి, బానోత్ కుమారి, శారద, సోలం నాగరత్నమ్మ, వీర్ల జయమ్మ, ఈశ్వరమ్మ, నల్లగొపు అనురాధ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే దాడులు



మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొత్తగూడెంరూరల్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒకటై, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ దాడులు చేయిస్తున్నారని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆరోపించారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామ పంచాయతీలోని ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయంగా పొంగులేటిని ఎదుర్కోలేక, మోదీ అండదండలతో దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాదరణ కలిగిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కంచర్ల చంద్రశేఖర్, ఆళ్ల మురళి, తూము చౌదరి, ఏనుగుల అర్జున్‌రావు, దర్మారావు ఉన్నారు.

పాల్వంచ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజామోద కార్యక్రమాలు చూసి ఓర్వలేక, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేయిస్తోందని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జాలే జానకిరెడ్డి, కొండం వెంకన్న, సాధం రామకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు బీఎంఎస్ ఆధ్వర్యాన ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 30వ తేదీన కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు బీఎంఎస్ నాయకుడు పి.మాధవనాయక్ తెలిపారు. సీఎంపీఎఫ్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని, విద్యుత్ సంస్థల నుంచి బకాయిలు ఇప్పించడంతో పాటు కార్మికులకు సొంతింటి పథకం, ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు చేయాలనే డిమాండ్లతో ఈ ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కార్మికులు విజయవంతం చేయాలని శనివారం ఆయన ఓ ప్రకటనలో కోరారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్

జూలూరుపాడు: స్థానిక పశువైద్యశాలలో శనివారం పశువైద్యాధికారి బద్యూలాల్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేశారు. కార్యక్రమంలో నరసింహారావు, రజనీకాంత్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జూలూరుపాడు: సాయిరాంతండాకు చెందిన బానోత్ నరసింహారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం నరసింహారావు దశదిన కర్మ కార్యక్రమంలో 1998–1999లో నరసింహారావుతో 10వ తరగతి చదువుకున్న స్నేహితులు మృతుడి భార్య రుక్మిణీకి రూ.38,000 ఆర్థిక సాయం అందజేశారు.

చిన్నారులకు వైద్యశిబిరం

ఇల్లెందురూరల్: కొమరారం పీహెచ్‌సీలో శనివారం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ లోహిత మాట్లాడుతూ.. నాణ్యమైన, పౌష్టికమైన ఆహారం తీసుకోవాలని, కాచి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

చలో హైదరాబాద్

ఇల్లెందురూరల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30న ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సారంగపాణి కోరారు. మర్రిగూడెం గ్రామపంచాయతీలోని పలు గ్రామాలలో శనివారం కరపత్రాలను పంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జటంగి వెంకన్న, బొర్ర భిక్షం, ఇర్ప రాజు, మల్లేశం, సురేష్, చరణ్, భాస్కర్, బాబురావు పాల్గొన్నారు.

ఏజీఎం దుర్గాప్రసాద్‌కు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా ఏజీఎం వీవీ దుర్గాప్రసాద్ ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ మేరకు శనివారం ఏరియా వర్క్‌షాపు ఏజీఎం శ్రీకాంత్ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్, ఉపేందర్ బాబు, బి.శంకర్, టి.అనిల్, ఎండీ సత్తార్‌పాషా, మధుకృష్ణ, రమేష్, భానుచందర్ పాల్గొన్నారు.

తుది ఓటర్ల జాబితా ప్రదర్శన

ఇల్లెందురూరల్: మండలంలోని 29 గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులు ఓటరు తుది జాబితాను ప్రదర్శించారు. తాజా జాబితా ప్రకారం మండలంలో మొత్తం 46,088 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 23,731, పురుషులు 22,357 మంది ఉన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి

ఇల్లెందురూరల్: నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ తాటి మల్లయ్య అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, సోలార్, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, ఆటోమొబైల్ విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ సమయంలో యూనిఫాం, బూట్లు, వసతి కల్పిస్తామని చెప్పారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

వెంచర్లకు అనుమతి తప్పనిసరి

సుజాతనగర్: అనుమతులు లేకుండా వెంచర్లు వేయరాదని సుజాతనగర్ పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు అన్నారు. శనివారం గొల్లగూడెం గ్రామంలో అనుమతులు లేకుండా వెంచర్ వేస్తున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లి నిర్వాహకులకు అవగాహన కల్పించారు. డీటీసీపీ అనుమతులు తీసుకోవాలని, లేదంటే ప్లాట్ల అమ్మకాలు చేయకూడదన్నారు. అనంతరం వెంచర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

టేకులపల్లిలో హైవే డిజైన్ మార్చాలి..



టేకులపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టోల్‌గేట్ బాధితులు



ఇల్లెందురూరల్: వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

టేకులపల్లి: నేషనల్ హైవే 930పీ నిర్వాసితుల సమావేశం శనివారం టేకులపల్లి తహసీల్‌లో నిర్వహించారు. టేకులపల్లి సెంటర్‌లో వైజంక్షన్ కారణంగా తమ నివాసాలు కోల్పోతున్నామని, రెండు వైపులా సమానంగా భూమి సేకరణ చేసేలా డిజైన్‌లో మార్పులు చేయాలని కోరుతూ బాధితులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా సులానగర్ సమీపంలో నిర్మించనున్న టోల్‌గేట్ కారణంగా తమకు జీవనోపాధి అయిన వ్యవసాయ భూములు కోల్పోతున్నామని టోల్‌గేట్‌ని మరో ప్రాంతానికి మార్చాలని కోరుతూ బాధితులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ భూములకు నివాసాలకు పరిహారం పెంచాలని పలువురు బాధితులు కోరారు.

బహిరంగ మార్కెట్ ధర ఇవ్వాలి..

టేకులపల్లి మండలంలో బహిరంగ మార్కెట్‌లో ఉన్న విధంగా హైవే భూములకు ధర చెల్లించాలని ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం టేకులపల్లి మండలం కిష్టారం, అందుగులగూడెం గ్రామ సీపీఎం శాఖ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో ఆయన మాట్లాడారు. ఈసం నరసింహారావు, దనసరి వీరస్వామి, కుంజ రాఘవేంద్ర, గొగ్గెల సర్దార్, బాలకృష్ణ, గుమ్మడి ఎర్రయ్య, జబ్బ నర్సయ్య, వేప నవీన్, ఇరప నాగార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాకే రహదారి పనులు..

ఇల్లెందురూరల్: నిర్వాసితులకు పరిహారం చెల్లించాకే రహదారి వెడల్పు పనులు ప్రారభమవుతాయని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. శనివారం తహసీల్‌లో నిర్వాసితుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు సమగ్రంగా సర్వే చేసిన తరువాతే రహదారికి కొలతలను నిర్దేశించారని చెప్పారు. నిబంధనల మేరకే పనులు జరుగుతాయని చెప్పారు. నిర్వాసితులు విధిగా తమ బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్స్ పత్రాలను తహసీల్‌లో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తీర్పు అంతిమం..



కేసులు పరిష్కరిస్తున్న జడ్జి కీర్తిచంద్రికారెడ్డి

ఇల్లెందు: లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశ్యం కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న పోలీస్ కేసులు రాజీ పడదగిన, మనోవర్తి, గృహహింస, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోటు కేసులు.. ఈ కేసులలో రాజీ కుదుర్చుకున్నట్లుయితే ఇరువర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమం అని న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికారెడ్డి అన్నారు. శనివారం ఇల్లెందు కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. కక్షిదారులు పంతాలకు వెళ్లకుండా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు భూక్యా రవికుమార్, ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తీక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బ్యాంకు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మోడల్ కాలనీ ప్రజలు

ఇల్లెందురూరల్: తిలక్‌నగర్ గ్రామపంచాయతీ జిల్లా పరిషత్ మోడల్ కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు శనివారం ఇల్లెందు – గుండాల ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ఉమ్మడి రొంపేడు గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో బొల్లినగర్‌లో బోర్ మోటార్ బిగించి నీటి సౌకర్యం కల్పించారని, మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సౌకర్యం కల్పించి గతంలో ఉన్న బోర్ మోటార్‌ను తొలగించారని వాపోయారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేదని, స్థానికులు నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు సుల్తానా, మొలుగు భాగ్యలక్ష్మి, మొలుగు శ్రీను, రాజు, గాజుల లీల, బాలమ్మ, సందీప్, శ్రీకాంత్, నరేష్, దోమల శ్రీను, సారమ్మ, విజయలక్ష్మి, భిక్షపతి, హైమవతి, లక్ష్మి, తార, వీరన్న, నాగేందర్, వేణు, షాహెద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జయంతి వేడుకలు

పాల్వంచ: బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు చేసి నూనుగు మీసాల వయస్సులోనే ఉరికంబాన్ని ముద్దాడిన షాహిద్ భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డును ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో భగత్‌సింగ్ 117వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వనాథం మాట్లాడుతూ.. యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, గుండాల నాగరాజు, దుగ్గిరాల సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, జకరయ్య, సత్యనారాయణ, అజిత్, పాల్గొన్నారు.



టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో.. నివాళులర్పిస్తున్న విద్యార్థులు

టేకులపల్లి: భగత్‌సింగ్ జయంతిని శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. బొమ్మనపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం ఎం.జ్యోతి రాణి, టీచర్ జే.పద్మ పాల్గొన్నారు.